## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



ఆ పార్టీ నాయకులకు అధికార యావే తప్ప.. విజన్‌ేది

3 గంటల కరెంటు చాలట.. 10హెచ్‌పీ మోటర్లట

# కాంగ్రెస్ వస్తే వ్యవసాయం ఖతమే



రైతుబంధు దుబారా అంటున్నరు.. ధరణి అసలే వద్దట

- రైతులు, కౌలుదారులకు మధ్య కొత్త కుంపటికి కుట్రలు
- ఫలితంగా వ్యవసాయ రంగంపై నీలినీడలు
- కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో వ్యవసాయంపైన, రైతుల మీద కాంగ్రెస్ పగబట్టినట్లు కనిపిస్తున్నది. కాంగ్రెస్ అగ్రనేతలు చేస్తున్న ప్రకటనలన్నీ ఆగమాగంగానే ఉన్నాయి. తమ పాలన నాటి పరిస్థితులకు వ్యవసాయాన్ని దిగజార్చడమే తమ ధ్యేయమన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో వ్యవహరిస్తూ వచ్చింది. ప్రాజెక్టుల ద్వారా సాగునీరు వస్తే.. ఆ నీటిని తోడుకునేందుకు ఇస్తున్న 24 గంటల కరెంటుపై ఆ పార్టీ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తూనే ఉన్నాయి. 24గంటలు వద్దు.. 3 గంటల కరెంటు ముద్దంటూ ఒకటికి రెండుసార్లు ఢంకా బజాయించి చెప్తున్నారు. అదేట్లా అని రైతులు నిలదీస్తే 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని సలహాలిస్తున్నారు. ఇక నిశ్చింతగా రైతుబంధు డబ్బు రైతుల ఖాతాల్లో జమ అవుతుంటే అది కాంగ్రెస్ నాయకులకు దుబారాగా కనిపిస్తున్నది. పైగా వాళ్లు వస్తే ఇస్తామంటున్న రైతు భరోసా రైతులకు, కౌలుదారులకు మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నది. ధరణిని భూమాతగా మార్చేస్తామంటూ.. అందులో రైతు భూమిపై కౌలుదారులకు, ఇనాందారులకు ఇలా ఇంకా ఎవరెవరికో చట్ట ప్రకారం హక్కులు కల్పిస్తామంటూ కొత్త చిక్కులకు తెరలేపారు. ఇలాంటివెన్నో గందరగోళ చర్యలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుండడంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. స్వరాష్ట్రంలో భారీగా పెరిగిన భూముల విలువకు ఎసరు పెట్టేలా.. పెరిగిన సాగు విస్తీర్ణాన్ని మళ్లీ కుచించుకుపోయేలా.. గ్రామాల్లో పచ్చని భూముల్లో చిచ్చురేపేలా.. ఫైనల్‌గా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తూ పల్లె జనం పట్నం వలసబాట పట్టేలా కాంగెస్ పార్టీ ప్రకటనలు రైతుల కడుపు మండిస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఎన్నో సార్లు నమ్మి ఆగమై గోసపడ్డ రైతన్నలకు ఆనాటి కాంగ్రెస్ పాలన మదిలో మెదులుతుండగా.. మళ్లోసారి కేసీఆర్‌కే జైకొట్టేందుకు సిద్ధమయ్యారు.

సమైక్య పాలనలో వెనుకబడిన జిల్లాగా ముద్రపడిన ఉమ్మడి నల్లగొండ నేడు వ్యవసాయంలోనే అగ్రగామిగా నిలుస్తున్నది. అటూ ఇటూ కృష్ణా, గోదావరి జలాలకు తోడు మధ్యలో మూసీ పరవళ్లు ఉమ్మడి జిల్లాను రాష్ట్రానికే అన్నపూర్ణగా మార్చేశాయి. నాడు 4నుంచి 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే.. నేడు 34లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్న జిల్లాగా అవతరించింది. దీనంతటికీ ఆనాటి ఉద్యమ నేత, నేటి ప్రజా పాలకుడు కేసీఆర్ విజనే కారణమన్నది కాదనలేని సత్యం. బోరు బావులపై ఆధార పడి రాష్ట్రంలోనే అత్యధిక వ్యవసాయ కనెక్షన్లు ఉన్న జిల్లా నల్లగొండనే. అలాంటి నల్లగొండ రైతన్నకు ముఖ్యమంత్రి ఇచ్చిన 24గంటల ఉచిత కరెంటు ఆయువుపట్టుగా మారింది. ఇక సాగర్ నుంచి కృష్ణా జలాలు, కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు జిల్లాకు తరలిరావడంతో సిరుల పంటకు వేదికైంది. ఉమ్మడి జిల్లాలో వరి సాగు 4.44 లక్షల ఎకరాల నుంచి 13.54 లక్షల ఎకరాలకు పెరిగింది. దీంతో ధాన్యం ఉత్పత్తిలోనూ సరికొత్త రికార్డును సృష్టించింది. ఇక పత్తి పంట సైతం 8లక్షల ఎకరాలకు విస్తరించింది. ఇలా ఏ పంటను చూసినా నల్లగొండ జిల్లా రైతన్న ఆదర్శంగా నిలుస్తున్నాడు. దీనంతటికీ కారణం.. కేసీఆర్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, ధరణి ద్వారా రైతులకు సర్వ హక్కులు ఇలా ఎన్నో రైతు సంక్షేమ కార్యక్రమాలే. ఇలాంటి కార్యక్రమాలతో రైతులంతా కేసీఆర్‌ను తమ పెద్దన్నగా భావిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇలాంటి పరిస్థితులన్నీ సహజంగా కాంగ్రెస్ అగ్రనేతలకు జీర్ణం కావడం లేదు. అందుకే ఎన్నికల ప్రచారం వేదికగా ఎన్నో కుట్రలకు తెరలేపుతూ రైతుల్లో తీవ్ర గందరగోళాన్ని కలిగిస్తున్నారు.

### వాళ్ల మాటలు ఆచరణలోకి వస్తే..

కాంగ్రెస్ అగ్రనేతలు చేస్తున్న ప్రకటనలు ఆచరణలోకి వస్తే వ్యవసాయం ఆగమాగమై రైతన్న ఖతం అవుతాడన్న చర్చ సర్వత్రా సాగుతున్నది. 24 గంటల స్థానంలో 3 గంటల కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన సాగుపై తీవ్ర ప్రభావం చూపనుంది. దాంతో సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతోపాటు దిగుబడి పూర్తిగా పడిపోనుంది. పైగా రైతుల్లో మానసిక అశాంతి మొదలై కంటిమీద కునుకు లేని పరిస్థితులు తథ్యం. దీంతో వ్యవసాయంపై విరక్తికి ఆస్కారం ఉంది. రైతుబంధు దుబారా అంటూ చేస్తున్న ప్రకటనలు కూడా రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు సీజన్ వస్తుందంటే పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు ఉత్సాహంతో సాగుకు సిద్ధమయ్యేవారు. కానీ.. రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ పూటకో తీరుగా మాట్లాడుతుండడం ఇబ్బందిగా మారింది. ఒకరు దుబారా అంటారు.. మరొకరు రైతులతోపాటు కౌలుదారులకు కూడా ఇస్తామంటున్నారు. ఇద్దరికీ ఎలా ఇస్తారంటే ఎవరికో ఒకరికే ఇస్తాం.. అది కూడా గ్రామసభ పెట్టి తేలుస్తామంటూ రేవంత్‌రెడ్డి చెబుతుండడం కలవరానికి గురిచేస్తుంది. ఇక ధరణితో భూ యజమానులు నిశ్చింతగా ఉన్నారు. తమ భూమిపై సర్వహక్కులు వాళ్లకే కట్టబెట్టడంతో భూముల విలువ కోట్లకు చేరినా ఇబ్బంది లేకుండా పోయింది. కానీ.. కాంగ్రెస్ నేతలు భూమాత అంటూ కౌలుదారులకు, ఇనాందారులకు తిరిగి హక్కులు కల్పిస్తామంటూ ప్రకటన చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం భూముల విలువలు లక్షల్లో పలుకుతున్న తరుణంలో ఇలాంటి చర్యలు కాంగ్రెస్‌కు తగదన్న చర్చ నడుస్తున్నది. వీటన్నింటి ఫలితంగా భూముల రేట్లు తగ్గడంతోపాటు సాగు విస్తీర్ణం కూడా పడిపోతుందన్న చర్చ మొదలైంది. ఇదే జరిగితే గ్రామాల్లో మళ్లీ ఉపాధి సమస్య తలెత్తి రైతులతోపాటు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు కూడా వలసబాట పట్టక తప్పదన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది. అందుకే వినాశకర కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామంటూ రైతన్నలు ఒక్కటవుతున్నారు. వ్యవసాయాన్ని ఖతం చేసే కుట్రలకు తెరలేపుతున్న కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో తామే ఖతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. వ్యవసాయం అంటే తెల్వని, దానిపై ఓ విజన్ అంటూ లేని కాంగ్రెస్ పార్టీ తమకు అవసరం లేదని రైతులు ఢంకా బజాయించి చెప్తున్నారు.

### కాంగ్రెస్‌తో రైతులకు ఒరిగేదేమీ లేదు

కాంగ్రెస్‌ను నమ్మితే మా జీవితాల్లో మేమే మట్టికొట్టుకున్నట్టే అవుతది. కాంగ్రెస్‌తో రైతులకు ఒరిగేదేమీ లేదు. నాకు ఎకరన్నర భూమి ఉన్నది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. మా మధ్యన అగ్రిమెంట్ ఉండదు. ఇప్పుడు కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వాలంటే రైతులకు అగ్రిమెంటు రాసి ఇవ్వాలి. అది జరుగని పని. ఇక కౌలు రైతులకు ప్రభుత్వం ఎట్లా రైతుబంధు ఇస్తది. ఎక్కువ మాట్లాడితే రైతులు భూమిని కౌలుకు ఇవ్వరు. అలవిగాని ముచ్చట్లు చెప్పుడు తప్ప, కాంగ్రెస్ చేసేదేమీ లేదు. ధరణి తీసేస్తామంటున్నరు. రైతుబంధు దుబారా అన్నోళ్లు అధికారం వచ్చాక ఇస్తారన్న నమ్మకం లేదు. కేసీఆర్ వచ్చినంకనే నీళ్లు, కరెంటు, విత్తనాలు అన్నీ సకాలంలో అందుతున్నాయి. దాంతో భూమి విలువ కోట్లలో పెరిగింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే భూమలు ధరలు పడిపోవడం ఖాయం. రైతులను రాజు చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే రైతులంతా ఉండాలి.

–పిశాటి సుదర్శన్‌రెడ్డి, మసీదుగూడెం, చౌటుప్పల్ రూరల్



### భూముల ధరలు పడిపోతయ్



కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోతే ఆకాశాన్నంటిన భూముల రేట్లు ఒక్కసారిగా పడిపోవడం ఖాయం. సమైక్య పాలనలో లక్ష కూడా పలుకని ఎకరం భూమి స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో 50 లక్షల నుంచి కోటి రూపాయలు పలుకుతుంది. కర్మగాలి కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందంటే భూమి ధరలు తగ్గుతాయి. భూములు కొనే దిక్కుండదు. కాంగ్రెసోళ్లు చెప్పే మాయమాటలు నమ్మకుండా రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతు పలుకుదాం.

–తుమ్మల సత్యనారాయణ, రైతు, వడపర్తి

### సాగు విస్తీర్ణం తగ్గనున్నది



దండుగ అన్న వ్యవసాయాన్ని సీఎం కేసీఆర్ పండుగలా మార్చారు. మిషన్ కాకతీయ పథకంతో భూగర్భజలాలు పెరిగినయ్. రైతుబంధు, రైతుబీమాతో భూముల ధరలు పెరిగాయి. కర్మగాలి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటుతో సాగు విస్తీర్ణం తగ్గుతుంది. భూములు బీళ్లుగా మారుతుంది. సాగుపై రైతులకు ఆసక్తి తగ్గుతుంది. భూముల ధరలు పడిపోయే ప్రమాదం ఉంది. తద్వారా మళ్లీ రైతులు బీదోళ్లుగా మారే అవకాశం ఉంది. తెలంగాణ రాకముందు ఉండే పరిస్థితి దాపురించనున్నది. మళ్లీ రైతుల ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉంటుంది. పంటలు పండకపోవడంతో కూలీల వలసలు పెరుగుతాయి. మళ్లీ పాత రోజులే వస్తాయి. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలు నమ్మొద్దు. నమ్మితే మళ్లీ వెనక్కి వెళ్లినట్టే.

–గంగాదేవి రవీందర్, న్యాయవాది, చౌటుప్పల్

### రైతులకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

కాంగ్రెసోళ్లు 50 ఏండ్లు పాలించి రైతులకు చేసిందేమీ లేదు. వారి హయాంలో వచ్చీరాని కరెంటుతో అంతా అంధకారమే. చిమ్మచీకటిలో బావి దగ్గర మోటర్ పెట్టేందుకు వెళ్లాలంటే వణుకుపుట్టేది. పాములు, తేళ్ల కాటుతో ఎందరో రైతులు మృత్యువాత పడేవారు. అలాంటిది స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం సరఫరా చేస్తున్న 24 గంటల కరెంటుతో పొద్దటిపూటనే మోటర్లు పెట్టుకుంటున్నాం. రైతుబంధు, రైతుబీమా పథకాలతో వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. మంచి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రైతులమంతా అండగా ఉంటాం.

–మల్లబోయిన లక్ష్మయ్య, రైతు, కుంట్లగూడెం, చౌటుప్పల్

